సాక్షి
పల్నాడు

బుధవారం, 13, డిసెంబర్, 2023

I




అయ్యప్ప స్వామి నగరోత్సవం

బాపట్లఅర్బన్: పట్టణంలో మంగళవారం నిర్వహించిన అయ్యప్పస్వామి నగరోత్సవం వైభవంగా సాగింది. ప్రత్యేక అలంకారంలో కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.



సంపూర్ణ భగవద్గీత పారాయణం

పాత గుంటూరు: గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అఖండ అహోరాత్ర సప్తహ, సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.30 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడిగా పీవీఆర్



నరసరావుపేట: మాచర్లకు చెందిన పిన్నెల్లి వెంకటరామిరెడ్డి(పీవీఆర్) వైఎస్సార్ సీపీ యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లాలో కొంతమంది నాయకులకు రాష్ట్ర యువజన విభాగంలో కీలక బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా తుమ్మా బాబుల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా బోయ రఘురామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గొల్లపల్లి లలిత్‌బాబును నియమించారు. అలాగే రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శిగా షేక్ మస్తాన్‌బీ, సంయుక్త కార్యదర్శిగా బందం రాపూరి నందిని, వంగా పద్మావతిరెడ్డిలను నియమించారు.

రేపు మినీ జాబ్ మేళా

నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించే నవోదయం కార్యక్రమంలో భాగంగా మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హెటిరో డ్రగ్స్, మిట్టపల్లి స్పిన్నర్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రదక్షిణ ఫిన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి మూడు రకాల కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విభాగాల వరకు చదువుకున్న 18 నుంచి 30 ఏళ్ల వయసు మధ్యనున్న నిరుద్యోగ యువతి, యువకులు వారి బయోడేటా, రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. నియోజకవర్గ పరిసర ప్రాంత యువతీ, యువకులు అందరూ ఈ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యార్డుకు 55,391 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 55,391 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 52,996 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,811 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సులో భర్తీ కాగా, మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్, దూరవిద్య ద్వారా పూర్తి చేసిన విద్యార్థినులు ప్రవేశం పొందుటకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో బుధవారం ఉదయం 9 గంటలకు నేరుగా కళాశాలకు వచ్చి రూ.6,300 ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో వసతి గృహ సదుపాయం సైతం ఉందని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా సీటు పొందు విద్యార్థినులకు ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ వర్తించవని, ఇతర సమాచారానికి 98480 38769, 99593 24563 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మ కాయల కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.2,300, మోడల్ ధర రూ.1,900 వరకు పలికింది.

హద్దుకున్న ఆనందం

‘భూహక్కు–భూరక్ష’తో మేలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఇగుటూరి కోటిరెడ్డి. ఊరు నరసరావుపేట మండలం దొండపాడు. ఇతనికి దొండపాడులో 1.73 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దశాబ్దాలుగా ఈ భూమి సాగుచేస్తున్నా సరైన హద్దులు, మ్యాప్‌లు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రీ సర్వే ద్వారా ఆయన పొలాన్ని కొలిచి, హద్దు రాళ్లు వేయడంతోపాటు శాశ్వత హక్కు పత్రాలు, మ్యాప్‌లు అందజేశారు. ఏ ఆఫీస్ మెట్లూ ఎక్కకుండా, లంచంతో పనిలేకుండా, రూపాయి ఖర్చు చేయకుండా ఆయన సమస్య తీరింది. రీ సర్వేతో భవిష్యత్‌లో ఎటువంటి భూ సమస్యలూ తలెత్తవని, భూరక్ష పథకంతో ఎంతో మేలని రైతు కోటిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

హద్దు చూపి.. రాళ్లు పాతి

- వేగంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష సర్వే
- మూడు దశల్లో 338 రెవెన్యూ గ్రామాల్లో పకడ్బందీగా..
- 3,00,414 హద్దు రాళ్లను పాతిన రెవెన్యూ సిబ్బంది
- 91,370 మంది రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ

జిల్లాలో రీసర్వే ఇలా..

మొత్తం రెవెన్యూ గ్రామాలు	338
డ్రోన్, ఏరియల్ సర్వే పూర్తయిన గ్రామాలు	338
మొత్తం భూ విస్తీర్ణం	13,66,403 ఎకరాలు
సర్వే డ్రోన్లు	2
రోవర్లు	114
ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్ పూర్తయిన గ్రామాలు	273
గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయిన గ్రామాలు	181
జారీ చేసిన శాశ్వత హక్కు పత్రాలు	91,370
పొల్లాల్లో పాతిన హద్దురాళ్ల సంఖ్య	3,00,414

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో వైఎస్సార్ జగనన్న భూహక్కు–భూరక్ష ద్వారా భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోంది. అటు భూ సర్వే, ఇటు హద్దు రాళ్ల ఏర్పాటు, భూహక్కు పత్రాల పంపిణీ ఇలా అన్ని పనులూ చకచకా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమం విజయవంతానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. చెదలు పట్టిన భూరికార్డుల వల్ల ఎవరి భూములు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. అడ్డూ అదుపులేని అక్రమాలు ఓ వైపు, న్యాయపరమైన చిక్కులు మరోవైపు. వీటన్నింటికీ పరిష్కారం చూపి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను శరవేగంగా పంపిణీ చేస్తున్నారు. భూముల రీ సర్వేకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడంతో దశాబ్దాలుగా ఉన్న భూ చిక్కుముడులు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి.

3,00,414 హద్దు రాళ్లు పాతి..

జిల్లాలో ల్యాండ్ అండ్ సర్వే అధికారులతోపాటు రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుంటూ భూసర్వే ముందుకు వెళుతోంది. జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 28 మండలాలు, 363 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో ఈనాం, పట్టణాల్లో విలీనమై గ్రామాలు పోను 338 గ్రామాల పరిధిలో మొత్తం 13,66,403 ఎకరాల భూ విస్తీర్ణాన్ని డ్రోన్ ద్వారా సర్వే చేశారు. రెండు డ్రోన్లు, 114 రోవర్లు పనిచేశాయి. మూడు దశల్లో కలిపి మొత్తం 273 గ్రామాల్లో ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్‌లు, 181 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశారు. ఇప్పటివరకు 91,370 మందికి రీ సర్వే తర్వాత కొత్త ఖాతాలు జారీ చేసి ప్రత్యేక క్యూఆర్ కోడ్ కలిగిన శాశ్వత భూ హక్కు పత్రాలు, మ్యాప్‌లను అందజేశారు. మిగిలిన గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి కావడంతో ఈనెలాఖరుకు రీ సర్వే పూర్తి చేసి శాశ్వత భూహక్కు పత్రాలు అందించేలా అధికారులు పనిచేస్తున్నారు. 361 మంది విలేజ్ సర్వేయర్లు, 370 మంది వీఆర్వోలు రీ సర్వేలో పనిచేస్తున్నారు. మూడుదశల్లో కలిపి 3,00,414 హద్దు రాళ్లను పాతి శాశ్వత సరిహద్దులు నిర్ణయించారు.



సత్తెనపల్లి మండలం రెంటపల్లిలో హద్దురాయి ఏర్పాటును పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్(ఫైల్)

నెలాఖరుకు రీసర్వే పూర్తి

జిల్లాలో రీసర్వే వేగంగా ఖచ్చితత్వంతో సాగుతోంది. డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా రెవెన్యూ సిబ్బంది పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 91,370 మందికి శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ పూర్తయింది. అలాగే 3,00,414 హద్దురాళ్లను రైతుల పొల్లాలో నాటే కార్యక్రమం పూర్తయింది. చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉంది.

– శివశంకర్ లోతేటి, పల్నాడు కలెక్టర్

భూమి చుట్టూ హద్దు రాళ్లు పాతారు



నాకు 3 ఎకరాల భూమి ఉంది. ఇటీవల జరిగిన రీ సర్వే ద్వారా నా పొలాన్ని కొలిచి, భూమి చుట్టూ హద్దు రాళ్లు వేశారు. శాశ్వత భూహక్కు పత్రం అందజేశారు. ఇందులో క్యూఆర్ కోడ్, మ్యాపుల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్లతో సహా అన్ని వివరాలూ ముద్రించారు.

– గాయం గోవిందరెడ్డి, మాచవరం, రొంపిచర్ల మండలం

వీరారాధనోత్సవాలు ప్రారంభం



వీరుల గుడికి వీర గంధం తెస్తున్న వీరాచారవంతులు

- తరలివచ్చిన వీరాచారవంతులు
- ఆయుధాలకు భక్తిశ్రద్ధలతో పూజలు
- ఉత్సాహంగా రాచగావు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో పల్నాటి వీరారాధన ఉత్సవాలు మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు వీరుల గుడి ప్రాంగణానికి తరలి వస్తున్నారు. రణక్షేత్రం పొలిమేరలో తూర్పున ఉన్న క్లళిపోతురాజు మండపం వద్ద పోతురాజుకు కొబ్బరి కాయలు కొట్టి అక్కడి నుంచి వీరుల గుడికి వస్తున్నారు. ఇదిలా ఉంటే వీరుల గుడికి వెల్లవేసే కార్యక్రమం కొనసాగింది. వీరుల గుడిలో ఉన్న ఆయుధాలను బయట పెట్టి పూజారులు గుడి మొత్తాన్ని శుభ్రం చేశారు. వీరుల ప్రతిరూపంగా ఉన్న వీర గల్లులను శుద్ధి చేసి పసుపు పూసి పూజకు సిద్ధం చేశారు. సాయంత్రం వీరుల గుడి పూజారుల్లో ఒకరైన పూజల పెదనరసింహ ఇంటి నుంచి వీరుల ఆయుధాలకు నూతన వస్త్రాలు తెచ్చారు. మరో పూజారి పూజల చిన నరసింహ ఇంటి నుంచి వీర గంధం తీసుకు వచ్చారు. అనంతరం వీరుల గుడిలో ఉన్న పల్నాటి వీరుల ఆయుధాలను నాగులేరు గంగధారి మడుగులో శుభ్రం చేశారు. పూజారులు స్నానాలు చేశారు. అనంతరం వీరుల గుడిలోకి ఆయుధాలను తరలించి అక్కడ పసుపు పూసి కొనలకు తిరునామాలు దిద్దారు. నూతన వస్త్రాలు, పూలమాలలతో ఆయుధాలను అలంకరించారు.

చెన్నకేశవస్వామి దర్శనం

వీరాచారవంతులు తమ ఆయుధాలతో తొలుత చెన్నకేశవస్వామిని దర్శించుకుని బ్రహ్మనాయుడు విగ్రహానికి తులసి, పూలమాలలు వేసి ధూపం వేశారు. అనంతరం వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయానికి తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ఉత్తర ద్వారం ద్వారా బాలచంద్రుని పాట్టేలు పాదముద్రలు ఉన్న చోట ఆచారవంతులు ఆగి తర్వాత కోట బురుజు మీదగా పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి తరుణ్ చెన్నకేశవతో కలసి వీరుల ఆయుధాలతో ఊరేగింపుగా రాత్రికి వీరుల గుడికి చేరుకున్నారు. వీరుల గుడి ముఖ మండపం మీద పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఎర్ర జెండాను ప్రతిష్ఠించారు. వీరుల ఆయుధాలను గుడిలో కొలువుదీర్చారు. వీరాచారులకు పీఠాధిపతి వీరుల గుడి ఆవరణలోని మండపంలో కంకణధారణ చేశారు. తాంబూలాలిచ్చారు.

అర్ధరాత్రి రాచగావు

ఈ కార్యక్రమాలు పూర్తయ్యే సరికి రాత్రి 12 గంటలైంది. సరిగ్గా అర్ధరాత్రి రాచగావు కార్యక్రమాన్ని ఆచారవంతుడు పోతురాజు నిర్వహించారు. రాచగావు వీరుల ఆత్మశాంతి కోసం నిర్వహించిన రహస్య క్రతువులా కొనసాగింది. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ సమక్షంలో వీరుల గుడి పూజారులైన పూజ గొల్లలు పెదనరసింహ, ఏడుకొండలు, నర్సయ్య, చిననరసింహారావు తదితరులు వీరాచారవంతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దర్శి ముక్కంటి రాచగావు కథాగానాన్ని పల్నాటి వీరుల గుడి ముందు మండపంలో ఆలపించారు. వీరజోళ్లు, సన్నాయి వాయిద్యాల మధ్య కత్తి, డాలు పట్టిన వీరవిద్యావంతుడు ముక్కంటి కథాగానాన్ని ఆలపిస్తూ అభినయించాడు. రాచగావు ఉత్సవం నాడు వీరాచారుల ఆచార వ్యవహారాలు కొనసాగాయి. పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ, పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ పర్యవేక్షణలో వీరాచారులు రాచగావుతో వీరారాధనకు శ్రీకారం చుట్టారు.

‘ఆడుదాం ఆంధ్రా’కు అపూర్వ స్పందన

- గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్న ప్రభుత్వం
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు
- జిల్లాకు చేరుకున్న 15,831 క్రీడా పరికరాల కిట్లు



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు ఇలా..

క్రీడ	దరఖాస్తుల సంఖ్య
క్రికెట్	34,361
బ్యాడ్మింటన్	7,427
వాలీబాల్	12,861
ఖోఖో	10,367
కబడ్డీ	15,342
మొత్తం	80,358

సాక్షి, నరసరావుపేట: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వం తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి అపూర్వ స్పందన వస్తోందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ వివరాలను ఆయన మంగళవారం మీడియాకు వివరించారు. 15 ఏళ్లు పూర్తయిన యువతలో క్రీడాస్ఫూర్తి, పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలో 531 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్లకు యువత నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే అన్ని క్రీడలకు కలిపి మొత్తం 80,358 దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు. అయితే రిజిస్ట్రేషన్లలో యువతుల నుంచి నమోదు తక్కువగా ఉందని, మరింతమంది మహిళా క్రీడాకారిణులు ముందుకు రావాలని కోరారు. బుధవారంతో రిజిస్ట్రేషన్ గడువు ముగియనుండటంతో యువత వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. క్రీడల నిర్వహణ తేదీలను త్వరలో ప్రభుత్వం ప్రకటించనుందని వివరించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కోసం ఇప్పటికే జిల్లాకు 15,831 క్రీడా కిట్లు వచ్చాయని కలెక్టర్ వెల్లడించారు. మైదానాలనూ సిద్ధం చేస్తున్నామన్నారు. ఆడుదాం ఆంధ్రా వెబ్‌సైట్ సందర్శించడంతోపాటు 1902 టోల్‌ఫ్రీ నంబర్, వలంటీర్ల ద్వారా ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

గడువులోగా ఓటరు జాబితా సిద్ధం చేయాలి

నరసరావుపేట: నిర్ణీత గడువులోగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలనూ పరిష్కరించాలని, కొత్త ఓటర్లను నమోదు చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని, చనిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాను జనవరి ఐదు నాటికి పూర్తిస్థాయి సమాచారంతో ఎన్నికల కమిషన్‌కు నివేదించాలని సూచించారు. దీనికి సంబంధించి ఢిల్లీలో నిర్వహించే ఎన్నికల కమిషన్ సమావేశానికి అన్ని రకాల సమస్యలను పరిష్కరించి జాబితా తయారు చేయాలని, జనవరి ఐదు నాటికి తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో వినాయకం, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ ప్రారంభం



హైజంప్‌లో పాల్గొన్న క్రీడాకారిణి



పరుగు పందెంలో పోటీ పడుతున్న క్రీడాకారులు



షాట్‌పుట్‌లో పోటీ పడుతున్న క్రీడాకారుడు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 67వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ అండర్–17, అండర్–19 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి దాదాపు 1,400 మంది క్రీడాకారులు, 200 మందికి పైగా వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు పోటీలకు హాజరయ్యారు. తొలిరోజు పోటీలో భాగంగా బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో అండర్–17 విభాగంలో బి.జాహ్నవి (పశ్చిమగోదావరి), బి.శైలజ (విశాఖ), బి.నందిని (విజయనగరం), అండర్–19 విభాగంలో ఎస్.లావణ్య (అనంతపురం), ఆర్.సాయిప్రియ (కర్నూల్), ఎం.బాలాంజలి (విజయనగరం), బాలుర అండర్–19 విభాగం 100మీటర్ల పరుగులో వి.హిమతేజ (నెల్లూరు), పి.వెంకటేష్ (విజయనగరం), ఎం.మనోహర్‌నాయక్ (వైఎస్సార్ కడప), అండర్–17 విభాగంలో కె.ఎస్.ఎస్.సాహిల్ బాబు (పశ్చిమగోదావరి), బి.సుకుమార్ (పశ్చిమగోదావరి), ఎస్.శంకర్‌నాయక్ (వైజాగ్) గెలుపొందారు. అలాగే బాలికల విభాగం అండర్–17 షాట్‌పుట్ పోటీలో ఈ.హేమసాయి (గుంటూరు),ఎండి.ఆషియా (గుంటూరు), కె.సుబ్బలక్ష్మి(వైజాగ్), బాలుర అండర్–17 విభాగంలో వి.సింహాచలం (వైజాగ్), పి.రాజశేఖరరెడ్డి (వైజాగ్), ఆర్.నాగవినయ్ (కృష్ణా), అండర్–19 విభాగంలో టి.చంద్రశేఖర్ (వైజాగ్), పి.నరేంద్రకుమార్ (వైజాగ్), సిహెచ్.అజయ్ (గుంటూరు) విజయం సాధించారు.

గ్రూప్‌–1, 2కు ఉచిత శిక్షణ

- లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ సహకారంతో ఆన్‌లైన్ తరగతులు
- సద్వినియోగం చేసుకోవాలన్న కలెక్టర్ శివశంకర్

సాక్షి, నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1, గ్రూప్–2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నామని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం మీడియా సమావేశం జరిగింది. డాక్టర్ పి.వి.లక్ష్మయ్యతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. పల్నాడులోని నిరుద్యోగ యువతకు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ స్టడీ సర్కిల్ (ఢిల్లీ) ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, గృహిణులు, వివిధ కారణాలతో ఇంటి వద్దే పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి ఈ తరగతులు ఉపయోగపడతాయని వివరించారు. స్టడీ సర్కిల్ చైర్మన్ పి.వి.లక్ష్మయ్య మాట్లాడుతూ.. వెంకటపతి విద్యా దీవెన అనే కార్యక్రమం ద్వారా 2016 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. గ్రూప్–1,2 ఉచిత శిక్షణను పల్నాడు యువత సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం www.drpvlakshmaiah.com లేదా 8500218036 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

కారెంపూడిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కారెంపూడి: పల్నాటి వీర ఆరాధన ఉత్సవాల సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వీరుల గుడి ఆవరణలో 15వ తేదీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు(వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీకాంత్), ద్వితీయ బహుమతి రూ.20 వేలు(సొసైటీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి నల్ల గురువారెడ్డి, బొగ్గరపు రామారావు), తృతీయ బహుమతి రూ.15 వేలు(బత్తుల కోటేశ్వరరావు కుమారుడు పవన్ కల్యాణ్), 4వ బహుమతి రూ.10 వేలు(ఊటా రాజశేఖరరెడ్డి) ప్రదానం చేయనున్నారని తెలిపారు. పోటీలలో పాల్గొనే ఫోన్ నంబర్లు 8074763565, 7569008335 సంప్రదించి తమ టీమ్‌ల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వైభవంగా కోటి వత్తుల కార్తిక దీపోత్సవం



తిమ్మారెడ్డిపాలెం(కర్లపాలెం): కార్తికమాసం చివరి సోమవారం రాత్రి కర్లపాలెం మండలం తిమ్మారెడ్డిపాలెం కోదండరామస్వామి ఆలయంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో కోటి వత్తుల కార్తిక దీపారాధన పూజలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి దీపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై రామాలయంలో పూజలు చేసిన అనంతరం కార్తిక దీపాలు వెలిగించి దీపోత్సవం ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ పులుగు గోవిందమ్మ మునిచంద్రారెడ్డి దంపతులు ఆలయ నిర్మాణ దాత మంతెన సూర్య స్వత నారాయణరాజు పార్వతి దంపతులు కోటి వత్తులతో కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయం వెలుపల శివలింగాకారంలో భారీ స్థాయిలో ముగ్గులు వేసి పలు రకాల పూలతో అలంకరణ చేసి కార్తిక దీపాలను వెలిగించారు. ఐదు కేజీల కర్పూరంతో మహా కర్పూర జ్యోతిని వెలిగించగా భక్తులు ప్రదక్షిణలు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం భజనలు భక్తులను అలరించాయి. అనంతరం గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించి అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పులుగు గోవిందమ్మ, ఎంపీటీసీ అక్కల వాణి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కీర్తి, ప్రతిష్టలను ఇనుమడింప చేసిన కరీంబాషా

మంత్రి అంబటి రాంబాబు



కరీంబాషాను సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన వెయిట్ లిఫ్టర్ కరీంబాషా సత్తెనపల్లి కీర్తి, ప్రతిష్టలను ఇనుమడింప జేశాడని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కొనియాడారు. పట్టణానికి చెందిన కరీంబాషా ఇటీవల బెంగళూరులో నిర్వహించిన బెంచ్ ప్రెస్ పోటీలలో 122.5 కేజీల బరువును ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం కరీంబాషాను సత్కరించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ పోటీలల్లో మెలకువలు తెలుసుకొని భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ, కోచ్ పసుపులేటి సురేష్, రైతు సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర రెడ్డి, రాజుపాలెం మండలం అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం యలమంద, పీడీ ఐఎస్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

హెల్వన్ యూనివర్సిటీతో డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఏంఓయూ



ఎంఓయూ పత్రాలను ప్రొఫెసర్ అశోక్‌కుమార్‌కు అందజేస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: ఈజిప్ట్ రాజధాని కైరోలోని హెల్వాన్ యూనివర్సిటీతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఎంఓయూ పత్రాలను హెల్వాన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సయీద్ కండిల్‌కు పంపారు. కండిల్ ఏంఓయూ పత్రాలపై సంతకాలు చేసి ఏఎన్‌యూ పంపారు. ఎంఓయూ పత్రాలను వీసీ మంగళవారం అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ వై.అశోక్‌కుమార్‌కు అందజేశారు. వీసీ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఈజిప్ట్ దేశంలోనే హల్వాన్ యూనివర్సిటీతో నిర్వహించిన ఎంఓయూ వర్సిటీకి మరింత ఖ్యాతిని పెంచుతోందని చెప్పారు. బోధన, పరిశోధన, సామాజిక, సాంస్కృతిక రంగాలలో రెండు యూనివర్సిటీల మధ్య అకడమిక్, సైంటిఫిక్, కల్చరల్ అంశాల్లో పరస్పర సహకారం ఉంటుందన్నారు. సదస్సులు, ఎగ్జిబిషన్, వర్క్‌షాప్, సంబంధిత అంశాల్లో స్వల్ప వ్యవధి గల కోర్సులు, సంయుక్త ప్రాజెక్టులు నిర్వహణ, అధ్యాపకులు, పరిశోధకులు, స్టూడెంట్స్ మధ్య మార్పులు, పీజీ, పీహెచ్‌డీల్లో సంయుక్తంగా పర్యవేక్షణ చేసేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య బి.కరుణ, అంబేడ్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహం లింకన్, అడ్మిషన్‌ల డైరెక్టర్ డాక్టర్ అనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

వలసల నివారణకే ఉపాధి హామీ పథకం

డ్వామా ఇన్‌చార్జి పీడీ అర్జునరావు

రేపల్లెరూరల్: వలసల నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పూర్తి స్థాయిలో పనిదినాలు కల్పించటంతోపాటు వేతన పంపిణీ సక్రమంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని డ్వామా ఇన్‌చార్జి పీడీ అర్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2020 ఏప్రిల్ నెల నుంచి 2023 మార్చి వరకు 3 లక్షల పనిదినాలలో రూ.9.32కోట్ల పనులు జరిగాయన్నారు. కూలీకు ఒక రోజుకు కనీసం రూ.272 వేతనం అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కూలీలకు నూరు రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని ప్రాంతాలలో పర్యటిస్తూ పనులు సక్రమంగా జరిగిందిలేనిది పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'లింగ నిర్ధారణ' చట్టరీత్యా నేరం

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అధ్యక్షతన గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం 1994పై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బందికి వర్క్‌షాపు జరిగింది. వర్క్‌షాపులో డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్‌ను తప్పనిసరిగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రిజిస్ట్రారు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసిన స్కానింగ్ చేయించిన సెంటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భంలో శిశువు లింగ నిర్ధారణ చేసి చెప్పడం చట్టరీత్యా నేరమని, అలా చెప్పిన వారికి, అడిగిన వారు చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు. జీజీహెచ్ గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జయంతి మాట్లాడుతూ ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కానింగ్ సెంటర్‌ల వారు ఏవిధంగా స్కానింగ్ వివరాలు ఫారం ఎఫ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వివరించారు. కార్యక్రమంలో డెమో జయప్రసాద్, హెచ్‌ఈఓ చంద్రశేఖర్, డెప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్, లీగల్ కన్సల్టెంట్ వాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో స్వైపింగ్ సదుపాయం

- ఆన్‌లైన్ ద్వారా అన్నీ లావాదేవీలు
- నగదు రహిత చెల్లింపులకు చర్యలు
- జిల్లాలో 527 గ్రామ పంచాయతీలు, 416 సచివాలయాలు



పంచాయతీలకు క్యూర్ కోడ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సత్య నారాయణ, ఈఓపీఆర్డీ దయాసాగర్

సత్తెనపల్లి: జిల్లాలోని అన్ని సచివాలయాల్లో స్వైపింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో పన్నులు, వివిధ సేవల రుసుం చెల్లింపునకు నగదు రహిత లావాదేవీలకు అవకాశం కల్పించారు. అందులో భాగంగా ఈ-పోస్(స్వైపింగ్) యంత్రాలు, క్యూఆర్ కోడ్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. జిల్లాలో 527 గ్రామ పంచాయతీలు, 416 గ్రామ సచివాలయాలున్నాయి. మూడు వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామ పంచాయతీలు 346 ఉండగా, మూడు వేల జనాభా కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలు 181 ఉన్నాయి. అందులో మూడు వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామపంచాయతీలకు 324 క్యూఆర్ కోడ్‌లను, మూడు వేల జనాభా కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు 72 ఈ-పోస్ యంత్రాలను ఇప్పటి వరకు అందించారు. ఇంకా 131 పంచాయతీలకు రావాల్సి ఉంది.

ఆన్‌లైన్ చెల్లింపులు..

మొత్తం 527 పంచాయతీల్లో ఆన్‌లైన్ చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి నగదు రహిత విధానం ప్రారంభమైనా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఈ-పోస్ యంత్రాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పంచాయతీలో నగదు రహిత లావాదేవీలు అన్నీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీలు బ్యాంకు ఖాతాలను తెరిచారు. గ్రామ పంచాయతీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత రుసుంతో పాటు ఇంటి యజ మానులు ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. వివిధ రకాల డేబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ఈ-పోస్ యంత్రాలు ఇచ్చారు. పన్నులకు సంబంధించి ప్రతిదీ లెక్క పక్కగా నమోదు చేస్తున్నారు. ఏ పంచాయతీ పరంగా ఎంత మొత్తం పన్నులు వసూలయ్యాయి? ఎంత కావాలనే? విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కార్యదర్శుల పని తీరు ఉన్నతాధికారులు తెలుసుకొని పర్యవేక్షించే సౌలభ్యం ఉంటుంది.

ప్రయోజనాలు...

- ఈ- పోస్ యంత్రాల ద్వారా చెల్లించిన వెంటనే రసీదు పొందవచ్చు.
- చెల్లింపు పూర్తి అయిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు అవుతాయి.
- అన్ని బ్యాంకుల ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డుల ద్వారా ఈ-పోస్ యంత్రంలో స్వైపింగ్ చేయవచ్చు.
- ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను వినియోగించవచ్చు.
- అవినీతికి అవకాశం లేకుండా పన్నుల ఆదాయం పంచాయతీ ఖాతాకు జమ అవుతోంది.
- చెల్లింపులు సులభంగా, వేగంగా పూర్తవుతాయి.

నగదు తీసుకుంటే క్రిమినల్ కేసులు

పంచాయతీలో అన్ని లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరగాల్సి ఉంది. పన్నుల వసూళ్లు, వివిధ రుసుంల చెల్లింపునకు ఈ-పోస్ యంత్రాలు, క్యూ ఆర్ కోడ్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఇప్పటికే పంచాయతీలకు క్యూఆర్ కోడ్‌లు, ఈ-పోస్ యంత్ర పరికరాలను అందజేశాం. నేరుగా నగదు తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆదేశాలు కూడా ఇచ్చాం. డిజిటల్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలందరూ సహకరించి ఆన్‌లైన్ చెల్లింపులు అలవాటు చేసుకోవాలి. దీనిపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా ఇచ్చాం.

–ఎంవీ భాస్కరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, పల్నాడు

సత్తాచూపిన ఆర్యవీర్ సెహ్వాగ్



మంగళగిరి: గుంటూరు జిల్లా నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న విజయ్ మర్చంట్ ట్రోఫీ-అండర్ -16 మూడు రోజుల క్రికెట్ పోటీలలో క్రికెటర్ సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ అర్ధసెంచరీతో అదరగొట్టాడు. రెండో రోజు మంగళవారం బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ జట్టులో కిరీట్ కౌసిక్ 77 పరుగులు చేయగా ఆర్యవీర్ సెహ్వాగ్ 54 పరుగులతో రాణించాడు. ఢిల్లీ జట్టు 82 ఓవర్లలో 304 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటక జట్టులో అమోగ్ ఆర్ షెట్టి 65 పరుగులతో రాణించగా ఆట ముగిసే సమయానికి కర్ణాటక జట్టు 36 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. రెండో రోజు ఢిల్లీ జట్టు కర్ణాటక జట్టుపై 57 పరుగుల ఆధిక్యంలో ఉంది.

డైట్ కళాశాలలో ముగిసిన కళా ఉత్సవ్



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

యడ్లపాడు: కళా ఉత్సవ్ 2023–24 పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులు పాటు రాష్ట్ర విద్య పరిశోధన మండలి ఆదేశాల మేరకు సోమ, మంగళవారాల్లో సంగీత, నాట్య, నాటక తదితర పది అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆయా విభాగాల్లో పోటాపోటీగా తమ ప్రదర్శనలు చేశారు. సాంప్రదాయ, జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయం తదితర విభాగాల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగిన ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు బోయపాలెం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. కళా ఉత్సవ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రసాద్, కళాశాల అధ్యాపకులు పి.పోలేరు, కె.యోగేశ్వరరావు, ఇతర అధ్యాపకులు ఆయా పోటీలను పర్యవేక్షించారని తెలిపారు. సాంప్రదాయ నృత్యం బాలికల విభాగంలో నరసరావుపేట, తెనాలి శ్రీచైతన్యకు చెందిన విద్యార్థినులు ఆర్.శ్రావణి, ఎస్.నిఖితసాయి, చీకటిఈగలపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని పి.జీవన వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. జానపద నృత్యాలు... నరసరావుపేట ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన పి.ఏంజల్, వేల్పూరు జెడ్పీ హైస్కూల్ చెందిన కె.నాగరోషిత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. డ్రామా(ఏకపాత్రాభినయం)లో మంగళగిరి ఎంటీఎం స్కూల్ విద్యార్థిని ఎం.మౌలిత, వేల్పూరు జెడ్పీ హెచ్‌ఎస్ టి.శ్రావణి ప్రథమ, ద్వితీయస్థానాల్లో గెలుపొందారు. విజేతలుగా నిలిచిన వారిని ప్రిన్సిపాల్ సుభాని, అధ్యాపకులు అభినందించారు.

ఏఎన్‌యూ ఖోఖో పురుషుల జట్టు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఖోఖో పురుషుల జట్టును ఎంపిక చేశారు. క్రీడాకారుల వివరాలను విక్టరీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కృష్ణంరాజు మంగళవారం ప్రకటించారు. రెండు రోజులుగా కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల ఖోఖో టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను జట్టుకు ఎంపిక చేసినట్లు వివరించారు. జట్టులో పి.సైదారావు, ఎం.అవినాష్, బి.ప్రతాప్, పి.అశోక్, ఎం.రామకృష్ణ (విక్టరీ డిగ్రీ కళాశాల, నరసరావుపేట), ఎం.వెంకటేష్, కె.వంశీ, కె.మహేష్, పి.శివగణేష్‌రెడ్డి, ఎ.కొరిష్‌బాబు (డీసీఆర్ఎం కళాశాల, ఇంకొల్లు), పి.గోపిచంద్, షేక్ అల్లీబాషా (కృష్ణవేణి డిగ్రీ కళాశాల, నరసరావుపేట), కె.అశోక్ (వాగ్దేవి డిగ్రీ కళాశాల, నరసరావుపేట), జె.శ్రీహరి (ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల ఏ ముప్పాళ్ల), బి.సింహాద్రినాయక్ (ఎస్‌కేఆర్ బీఆర్ కళాశాల, నరసరావుపేట) ఎంపికయ్యారు. ఎంపిక కమిటీ సభ్యులుగా వి.వెంకట్రావు, రాఘవయ్య, పరిశీలకుడిగా శివప్రసాద్ వ్యవహరించారు.



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో కళాశాల ప్రతినిధులు

వైభవంగా కార్తిక దీప శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న శివనాగేంద్ర సరస్వతీ స్వామి

అమరావతి: కార్తిక మాసం ముగింపు సందర్భంగా అమరావతిలో కార్తిక దీప శోభాయాత్ర మంగళవారం రాత్రి నిర్వహించారు. అమరేశ్వర స్వామి దేవస్థానం ఈఓ వి.గోపినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభాయాత్రలో భక్తులు తొలుత కార్తిక దీపాలతో అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరిదేవికి హారతులిచారు. శోభాయాత్రలో కాశీ పీఠాధిపతి శివనాగేంద్ర సరస్వతీ స్వామి, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకురాలు నంబూరు వసంత కుమారి పాల్గొన్నారు.

అమరేశ్వరుని సేవలో కాశీపీఠాధిపతి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరుని కాశీ పీఠాధిపతి శివనాగేంద్ర సరస్వతీస్వామి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులనుద్దేశించి అను గ్రహభాషణం చేశారు. తొలుత ఆయనకు ఆలయ ఈఓ వి.గోపినాథశర్మ, అర్చకులు స్వామికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు వసంతకుమారి, ఎన్.బాబూరావు, వి.హనుమంతరావు పాల్గొన్నారు.

బాలోత్సవం.. ఆనందోత్సవం..

చెంగు చెంగున గంతులు వేస్తున్న లేడి పిల్లలు, తనివి తీరా వినేలా చెవులకు విందుగా కోయిల రాగాలు, ముచ్చట గొల్పుతున్న చిన్నారుల వేషధారణలతో బాలోత్సవ్ భళా అన్నట్లుగా వీవీఐటీ ప్రాంగణం కళకళలాడింది. సినీగీతాల నృత్యాలు జానపద నృత్యాలతో వేదికలు దద్దరిల్లాయి. వాద్య సంగీతం, రాగ సంగీతంతో చిన్నారులు మురిపించారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించిన నాటికల సారాంశం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. బాలోత్సవం ఆనందోత్సాహాలతో సాగింది.

- వీవీఐటీలో సందడి సందడిగా తెలుగు బాలల పండుగ
- కళలతో మంత్రముగ్ధులను చేస్తున్న చిన్నారులు



బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

పెదకాకాని: ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్- 2023 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో చిన్నారుల కేరింతలతో రెండో రోజు కోలాహలంగా కొనసాగాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీలో మూడు రోజుల బాలోత్సవ్ వేడుకల్లో భాగంగా రెండవరోజు మంగళవారం బాలోత్సవ్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన శాస్త్రసాంకేతిక అంశాలలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో నిర్వహించిన సైన్స్ ప్రయోగశాల పోటీలను ఆంధ్రప్రదేశ్ నాన్ తెలుగు రెసిడెన్స్ సొసైటీ అధ్యక్షుడు మేడపాటి వెంకట్ ప్రారంభించారు. ఈ పోటీల్లో 250 మంది విద్యార్థులు సామాజిక అంశాలతో రూపొందించిన 60 శాస్త్ర సాంకేతిక ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. రెండవరోజు పెద్ద ఎత్తున సందర్శకులు హాజరు కావడంతో బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారింది. 280 పాఠశాలల నుంచి 4,000 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రెండో రోజు పోటీల్లో భాగంగా జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం, తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నృత్యాలు వేదికల వద్ద సందడిగా సాగాయి. బాలబాలికలచే ప్రదర్శించిన 54 నాటికలు చిన్నారులకు సమాజం పట్ల ఉన్న దృక్పథాన్ని సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా కొనసాగాయి. సమాజానికి హితవు పలికే విధంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీశాయి. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు అనుభవాల మార్పిడి, కొత్తదనం నేర్పించడానికి ఉపయోగపడేలా న్యాయనిర్ణేతలు బోధనలు చేశారు. వాద్య సంగీతంలోని రాగ ప్రధానం, తాళప్రధానం ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు మంచిని అలవరుచుకోవాలని చెడుకు దూరంగా ఉండాలంటూ బుద్ధికి కాపలా అవసరం అంటూ రసఝురి మండలి పొన్నూరు వారితో ప్రదర్శించిన కాపలా నాటిక విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది.

భద్రతా చర్యలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

మైన్స్ అండ్ సెఫ్టీ డెప్యూటీ డైరెక్టర్ జ్ఞానేశ్వర్

బల్లికురవ: గ్రానైట్ క్వారీలో భద్రతా చర్యలు పాటిస్తూ మేనేజర్, మేట్ అందుబాటులో ఉంటూ కార్మికులతో పనులు చేయిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని మైన్స్ అండ్ సేఫ్టీ డెప్యూటీ డైరెక్టర్(హైదరాబాద్) జ్ఞానేశ్వర్ అన్నారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కొణిదెన రెవెన్యూలోని ఈర్లకొండ ఇంపీరియల్ క్వారీలో నవంబర్ 11వ తేదీ వైసా కటింగ్ చేస్తూ కిందపడి గాయాలపాలై చనిపోయిన తిప్పన ప్రసాద్ (43) మృతికి సంబంధించి క్వారీలో రెండోసారి డీడీ ఎంఎస్ విచారణ చేపట్టారు. మైన్స్ అండ్ సేఫ్టీ టీమ్ శ్రీనివాస, శాయి స్టోన్స్, అమూల్య, శ్రీకాంత్, బీవీఎల్ రాక్స్ అండ్ మైన్స్ క్వారీలో జరిగిన భద్రతా వారోత్సవాల్లో భాగంగా భద్రతకు సంబంధించి జెండాల ఆవిష్కరణతో క్వారీ రికార్డులు, రహదారులు, వసతులు పరిశీలించారు. 21వ భద్రతా వారోత్సవాల్లో నిబంధనలు పాటిస్తున్న క్వారీలకు అవార్డులు అందజేస్తామని జ్ఞానేశ్వర్ వివరించారు. వారోత్సవాల్లో టీమ్ సభ్యులు శినాగేశ్వరరావు, బ్రహ్మయ్య, ప్రశాంత్ నాగావళి, క్వారీ ఇన్‌చార్జులు జి.తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.